
సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 17 । జనవరి । 2025



అప్పన్న వస్తువుల తనిఖీ 8లో

సింహాచలేశునికి భక్తులు కానుకగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన ఆభరణాలను శుక్రవారం తనిఖీ చేయనున్నారు.



వృద్ధ దంపతులకు సత్కారం

శ్రీవేంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు 60ఏళ్లు దాటిన దంపతులను సత్కరించారు. 9లో

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం ఘనంగా జరిపారు. ఉభయ దాతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కొత్తపల్లి జలపాతానికి పోటెత్తిన పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. పర్యాటకులు, వివిధ విద్యా సంస్థల చెందిన విద్యార్థులతో గురువారం కొత్తపల్లి జలపాతం ప్రాంతం కిటకిటలాడింది. వారంతా ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ జలపాతంలో ఉత్సాహంగా స్నానాలు చేశారు. జలపాత సమీప ప్రాంతాల్లో గల వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు తీసుకొని, సమీప అటవీ ప్రాంతంలో వనభోజనాలు చేసి, సాయంత్రం వరకు పర్యాటకులు సందడి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక 33 కెవి విద్యుత్ లైన్ దగ్గరగా ఉన్న చెట్లు కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ గాబ్రియల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- హుకుంపేటలో 10.1 డిగ్రీలు నమోదు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. దాంతో చలి, మంచు తీవ్రత అధికంగానే ఉంది. గురువారం హుకుంపేటలో 10.1 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో పాడేరులో 10.5 డిగ్రీలు, డుంబ్రిగుడలో 10.6, చింతపల్లిలో 10.8, జి.మాడుగులలో 11.1, ముంచంగిపుట్టులో 11.4, పెదబయలులో 11.8, జీకే వీధిలో 12.6, అనంతగిరిలో 13.4 డిగ్రీలు నమోదు కాగా కొయ్యూరులో 15 డిగ్రీలు నమోదైనట్లు ఏడీఆర్ తెలిపారు. ఉదయం 10 గంటల వరకు మంచు అధికంగా కురవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించారు. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలులు వీస్తుండంతో వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.

19న రేషన్ డీలర్ అభ్యర్థులకు రాత పరీక్షలు

పాడేరు రూరల్: రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాత భవనంలో ఈనెల 19వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, వివిధ మండలాల పరిధిలో ఉన్న అభ్యర్థులు సమీప తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి ఈనెల 18వ తేదీ లోగా హాల్ టికెట్లు తీసుకోవాలని ఆయన కోరారు.

చర్లపల్లి-విశాఖ-భువనేశ్వర్ ప్రత్యేక రైలు

విశాఖ విద్య: సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం- చర్లపల్లి- భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు(08549/08550) నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. రైలు నంబర్ 08549 విశాఖపట్నంలో ఈ నెల 18న సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరుతుంది. రాత్రి 8.18 గంటలకు దువ్వాడ చేరుకుని, 8.20 గంటలకు అక్కడ నుంచి బయలుదేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. రైలు నంబర్ 08550 ఈ నెల 19న ఉదయం 9 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి సాయంత్రం 6.40 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. దువ్వాడలో 6.45 గంటలకు బయలుదేరి రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖలో రాత్రి 7.50 గంటలకు బయలుదేరి ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున 2.15 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.

ఆరోగ్యం బాగుండాలి.. పంటలు బాగా పండాలి.. అంతటా ఆనందం తాండవించాలి.. అంటూ పాడేరు మండలం డోకులూరు గ్రామంలో జరిగిన భారీజం సంబరాలు అంబరాన్నంటాయి. భారీజం అంటే భారీ విజయం అని అర్థం. పిల్లా పాపలు, పశువులకు ఎలాంటి అనారోగ్యం సోకకూడదని, కరువు కాటకాలు దరి చేరరాదని, దుఃఖంపై విజయం సాధించి అందరూ సుఖంగా ఉండాలని ఈ వేడుక నిర్వహిస్తారు.



ఊరంతా సందడి: థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

ఆకాశమే హద్దుగా..

అంగరంగ వైభవం.. భారీజం సంబరం

- ప్రతిబింబించిన గిరిజన సంప్రదాయాలు
- థింసా నృత్యాలతో హోరెత్తిన డోకులూరు
- ఆకట్టుకున్న కత్తుల విన్యాసాలు



డోకుల వారి ఇంట్లోని సంప్రదాయ కత్తులకు పూజలు చేస్తున్న డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ఇతర గిరిజనులు

సాక్షి, పాడేరు: గిరిజనుల సంప్రదాయాన్ని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే భారీజం సందడి మన్యంలో తాండవించింది. అందరూ ఆరోగ్యంగా జీవించాలని, పంటలు బాగా పండాలనే ఆకాంక్షతో ప్రకృతి దేవతలు, గ్రామంలోని గిరిజనుల ఆరాధ్యదైవం శంకులమ్మ తల్లికి పూజలు చేస్తూ సంక్రాంతి సీజన్‌లో భారీజం పండగను గిరిజనులు ఘనంగా జరుపుకుంటారు. డోకులూరు గ్రామంలో ప్రతి ఏడాది ఈ వేడుక జరుపుకోగా, అనేక ప్రాంతాల్లో మూడేళ్లకు ఓసారి ఈ పండగ నిర్వహిస్తారు. డోకులూరులో గురువారం భారీజం పండగ హోరెత్తింది. గ్రామచావిడిలో గిరిజన సంప్రదాయ డప్పు వాయిద్యాలను మోగించిన గిరిజనులు భారీజంను ఈ ఏడాది ఘనంగా ప్రారంభించారు. డోకుల కుటుంబం ఇంటిలో పూజలందుకుంటున్న పురాతన నాలుగు కత్తులకు సంప్రదాయంగా మళ్లీ పూజలు చేశారు. తమర్బ వంశానికి చెందిన డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు, గ్రామంలోని పొంగి, దూరు, డోకుల కుటుంబాల పెద్దలంతా ఈ కత్తులకు పూజలు చేసిన అనంతరం గ్రామంలోని శంకులమ్మతల్లి, గంగమ్మతల్లి దేవతామూర్తులు కొలువుదీరిన ఆలయాల వరకు ఘనంగా ఊరేగించారు. శంకులమ్మతల్లి ఆలయం వద్ద కత్తులను ప్రతిష్ఠించి మళ్లీ ఆ ఆయుధాలకు గిరిజనులంతా ప్రత్యేక పూజలు చేసి కోడిని బలిచ్చారు. అనంతరం వేర్వేరు కులాలకు చెందిన గిరిజనులు బావమరుదులు వరుస చూసుకుని కత్తులను చేతబూని ప్రదర్శన చేశారు. ఈ కత్తుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కత్తులను మళ్లీ గ్రామ చావిడి వరకు ఊరేగింపుగా మోసుకువెళ్లారు. ఆ సమయంలో కత్తుల ఊరేగింపు సంబరానికి అనేక గ్రామాల గిరిజనులు భారీగా తరలివచ్చారు.

మయూరాల్లా థింసా నృత్యాలు

భారీజం పండగతో డోకులూరు గ్రామంలో అన్ని వర్గాల గిరిజనులు మయూరాల్లా పోటాపోటీగా థింసా నృత్యాలు చేశారు. శంకులమ్మ తల్లి ఆలయ ప్రాంగణంతో పాటు గ్రామ చావిడిలోను సుమారు 3 గంటలపాటు థింసా నృత్యాలు హోరెత్తాయి. చిన్న పెద్ద తేడా లేకుండా గిరిజనులు థింసా నృత్యాలతో సందడి చేశారు. ఒడియా బ్యాండ్ అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం ఈ కత్తులను గ్రామచావిడిలో పెద్దలంతా ప్రదర్శన నిర్వహించిన డోకుల కుటుంబంలోని దేముడు మూలకు చేర్చారు. అనంతరం భారీజం పండగను భక్తిశ్రద్ధలతో ఈ ఏడాదికి ఘనంగా ముగించారు.



భారీజం ఊరేగింపులో పాల్గొన్న గిరిజనులు



శంకులమ్మతల్లి వద్ద కత్తులను కొలువుదీర్చి పూజలు

జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!



మీకే జంతువంటే ఇష్టం..! తెల్లపులి...ఏనుగు...సింహం...జిరాఫీ....ఖడ్గమృగం... చింపాంజీ...లేళ్లు...ఇవే కాదు..నెమళ్లు...రకరకాల పక్షులు, తాబేళ్లు...మొసళ్లు...పాములు...! ఏవైనా సరే వన్యప్రాణులంటే ప్రేమ చూపేవారు జంతు సంరక్షణ పట్ల ఎంతో మక్కువ చూపుతారు. జంతువులంటే మనకు ఎంత ప్రేమ ఉన్నా వన్యప్రాణులను మనం పెంచుకోలేం...కానీ వాటి సంరక్షణకు ఇతోధికంగా సహాయపడవచ్చు. జూలో జంతువులను దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, లేదా సంవత్సరం పాటు వాటికి ఆహారం అందించడానికి ఎందరో జంతు ప్రేమికులు బాధ్యతగా తీసుకుని ఆర్థికంగా సహాయపడుతున్నారు. అలా దత్తత తీసుకున్న వారిలో వ్యక్తులు, సంస్థలు కూడా ఉన్నారు. మీకూ ఆసక్తిగా ఉందా... 8లో

ఆటోలో బాలింత తరలింపు

- అక్కరకు రాని తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్



బాలింతను ఆటోలో తరలిస్తున్న బంధువులు

అరకులోయ టౌన్: అరకులోయ ఏరియా ఆస్పత్రిలో ఈనెల 13న ప్రసవించిన బాలింతకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను ఇవ్వకపోవడంతో ఆటోలో స్వగ్రామానికి తరలించినట్లు సర్పంచ్ మాదల బుటికి తెలిపారు. మండలంలోని మారుమూల పాంత్రం ఇరగాయి పంచాయతీ ఉరుముల గ్రామానికి చెందిన కొర్రా పుష్పలతను స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వాలని కోరగా మారుమూల ప్రాంతానికి అంబులెన్స్ ఇవ్వలేమని ఆస్పత్రి వర్గాలు చెప్పాయన్నారు. బస్సు సౌకర్యంలేని గ్రామాల్లో బాలింతలకు అంబులెన్స్ ఇవ్వకపోవడం చాలా దారుణమని సర్పంచ్ బుటికి తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాము వివరణ కోరగా.. నలుగురిని దింపేందుకు అప్పటికే తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు వెళ్లాయని, ఆలస్యమవుతుందని, వేచి ఉండమని చెప్పామని, వారే ఆటో కట్టించుకొని వెళ్లిపోయారని వివరించారు.

చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న నవజ్యోతి మిశ్రా

చింతపల్లి: చింతపల్లి పోలీస్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఏఎస్పీ)గా నవజ్యోతి మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి డీఎస్పీగా ప్రస్తుతం షేక్ షహబాజ్ అహ్మద్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఐదుగురు ఏఎస్పీలకు వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన నవజ్యోతి మిశ్రా శిక్షణ ముగించుకుని ప్రస్తుతం గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఆయనను చింతపల్లి ఏఎస్పీగా ప్రభుత్వం నియమించడంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు గంజాయి, మావోయిస్టు కార్యక్రమాలను అదుపు చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మెరుగుపరచడంతోపాటు గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు సీఐలు వినోద్‌బాబు, వరప్రసాద్, వెంకటరమణ, ఎస్సైలు వెంకటేశ్వరరావు, అప్పసూరి తదితరులు ఏఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ బకాయిలు చెల్లించాలి

- విద్యుత్ శాఖ డీఈ రాంబాబు



విలేకరులతో మాట్లాడుతున్న డీఈ రాంబాబు, ఏఈ ప్రభాకర్

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలు బకాయి పడ్డ విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కోట్ల సన్ని రాంబాబు చెప్పారు. ఆయన గురువారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 10 ఎకరాలు పొడి, 3 ఎకరాలు తడి భూమి కలిగి ఉంటే ఎస్సీ, ఎస్టీలు కూడా సబ్సిడీకి అర్హులు కాదన్నారు. ప్రభుత్వ సంస్థల్లో నెలకు 12 వేల ఆదాయం పైన ఉన్న వారు కూడా అర్హులు కాదన్నారు. ఇప్పటి వరకూ చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 5,770 మంది ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో రూ.5 వేలు పైబడి బకాయి పడ్డ వినియోగదారులు 1074 మంది ఉన్నారన్నారు. వీరి నుంచి రూ.కోటి 74 లక్షల బకాయిలు రావల్సి ఉందన్నారు. విద్యుత్ వినియోగదారులు వెంటనే బకాయిలను చెల్లించాలన్నారు. తొలిగా నోటీసులు జారీ చేస్తామని, 15 రోజుల్లోగా బిల్లులు చెల్లించనట్లయితే విద్యుత్ కనక్షన్లను తొలగిస్తామన్నారు.

జాతరలో చల్ చల్ గుర్రం!

ఒకప్పుడు రవాణా సౌకర్యాలు లేని రోజుల్లో గుర్రం జట్కా బళ్లే ప్రధాన రవాణా వాహనంగా ఉండేవి. మారిన కాలంలో జట్కా బళ్లు కనుమరుగైపోవడంతో కొంతకాలం గుర్రాల గిట్టల శబ్దాలు కనుమరుగయ్యాయి. ఇప్పుడు మళ్లీ చల్ చల్ గుర్రం ...చలాకీ గుర్రం... అంటూ గుర్రాలు పరుగులు తీస్తున్నాయి. రాజుల కాలంలో ఓ వెలుగు వెలిగిన గుర్రపు స్వారీ, పరుగు పోటీలు ఇప్పుడు మరలా గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. కేవలం క్రీడా స్ఫూర్తితో నిర్వహించే గుర్రాల పరుగు పోటీలు ఇటీవల కాలంలో గ్రామాల్లో జరిగే ప్రతి ఉత్సవాల్లో సందడి చేస్తున్నాయి.



- దౌడుకు సిద్ధమైన గుర్రాలు
- సంక్రాంతి తీర్థాల్లో పోటీల సందడి
- ఎడ్ల బళ్ల పోటీలకు దీటుగా మైదానాలు సిద్ధం


చోడవరం : జిల్లాలో క్రీడా స్ఫూర్తితో నిర్వహించే గుర్రాల పరుగు పోటీలు సంక్రాంతి తీర్థాల్లో ప్రత్యేక ఆకర్షణ. గ్రామదేవతల పండగల వరకు అన్ని ఉత్సవాలు గుర్రాల జాతరను తలపిస్తాయి. కొందరు పోటీల కోసమే గుర్రాల పెంపకం చేపడుతుండడం విశేషం. జైపూర్ మహారాణి పాలనలో మాడుగులలో దసరా రోజున ప్రత్యేకంగా గుర్రాల సంత కూడా జరిగేది. ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు వెళ్లేందుకు మైదాన గిరిజన గ్రామాలకు చెందిన వారు నేటికీ గుర్రాలనే రవాణాకు ఉపయోగిస్తున్నారు. దీంతో మైదాన గిరిజన గ్రామాల్లో వీటి పెంపకం పెరిగింది. ప్రస్తుతం సంక్రాంతి తీర్థాలు కనుమ పండగ నుంచి ప్రారంభం కావడంతో గ్రామీణ తీర్థాల్లో గుర్రాల దౌడు మొదలైంది.

మైదానాలు రెడీ

చోడవరం, కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, రావికమతం, మాడుగుల, అచ్యుతాపురం, పాయకరావుపేట, నర్సీపట్నం, కోటవురట్ల, రాంబిల్లితోపాటు రాజరిక కీర్తిని సంతరించుకున్న పద్మనాభం, ఎస్.కోట, భీమిలి, ఆనందపురం ప్రాంతాల్లో గుర్రాల పరుగు పోటీలు జోరుగా నిర్వహిస్తున్నారు. సాధారణంగా మేలు రకం గుర్రాల ధర రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకూ ఉంటుంది. అయినా సరే గుర్రాల పోటీలపై మక్కువతో పలువురు ఎంత ధరైనా చెల్లించి గుర్రాలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. రాజస్థాన్, గుజరాత్, హైదరాబాద్, జైపూర్, కటక్ ప్రాంతాల నుంచి మేలు రకం గుర్రాలను కొనుగోలు చేసి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.



గుర్రపు స్వారీపై శిక్షణ పొందుతున్న యువకులు



టైమింగ్ కోసం శిక్షణ ఇస్తున్న గుర్రం

రేస్‌లు...ఇలా...

గుర్రాల పోటీలను మూడు రకాలుగా నిర్వహిస్తారు. పోటీకి వచ్చిన గుర్రాల సంఖ్యను బట్టి రెండు మూడు గ్రూపులుగా విభజించి ఒకేసారి 5 నుంచి 7 గుర్రాలను బరిలోకి దించి స్వారీ చేస్తారు. ముందుగా గమ్యం చేరిన గుర్రాలను వరుసగా గెలుపొందినట్టుగా ప్రకటిస్తారు. రెండో రకం పోటీలో రెండేసి గుర్రాలను బరిలోకి దించి దౌడు తీయిస్తారు. గెలుపొందిన వాటికి మరలా పోటీ పెట్టి తుది విజేతలను ప్రకటిస్తారు. మూడో రకం పోటీల్లో ఒక్కో గుర్రాన్ని దౌడు తీయించి తక్కువ సమయంలో గమ్యాన్ని చేరిన గుర్రం గెలిచినట్టుగా ప్రకటిస్తారు.

నేటి నుంచి పోటీలు మొదలు...

ఈనెల 17వ తేదీ జిల్లాలో అతి పెద్ద పండగైన చోడవరం మండలం నర్సాపురం తీర్థ మహోత్సవం, బుచ్చెయ్యపేట మండలం రాజాం, ఆనందపురం గ్రామాల్లో పండగలు సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పరుగుల పోటీని ఏర్పాటు చేశారు. ఈనెల 18న భోగాపురంలోను, 20న శీమునావల్లి గ్రామాల్లో జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.

పరిశ్రమలు, కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు

సాక్షి, పాడేరు: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా పలు పరిశ్రమలు, కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ టాప్ 500 కంపెనీల్లో కోటి మందికి ఉద్యోగాలు కల్పించేందుకు రూ.800 కోట్లతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. టెన్త్, పాలిటెక్నిక్, ఐటీఐ బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ చదివిన అభ్యర్థులు 21 ఏళ్ల నుంచి 21 ఏళ్ల వయస్సు లోపువారు అర్హులన్నారు. నెలకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు స్టైఫండ్, పీఎం జీవన్‌జ్యోతి, బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 12 నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సులలో ఎన్‌రోల్ కారాదని, ప్రభుత్వ ఉద్యోగం కూడా కలిగి ఉండకూడదన్నారు. ఆన్‌లైన్, దూరవిద్య కోర్సులు చేస్తున్న వారు మాత్రం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల కన్నా ఎక్కువ ఉండకూడదన్నారు.మరిన్ని వివరాలకు 9988853335, 8712655686, 8790117279 నంబర్లకు సంప్రదించాలని ఆమె కోరారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు -8లో

అప్పన్న బంగారం, వెండి వస్తువుల తనిఖీ నేడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు కానుకగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన ఆభరణాలను దేవదాయ శాఖ శుక్రవారం తనిఖీ చేయనుంది. దేవస్థానానికి భక్తులు సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువుల వివరాలను బహిర్గతం చేయాలని, వాటికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలియజేయాలని కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి గతేడాది నవంబర్‌లో దేవదాయ శాఖలో పిటిషన్ వేశారు. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ డిసెంబర్‌లో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం జోన్-1 ఆర్జేసీ, నగల తనిఖీ అధికారులతో కూడిన కమిటీ శుక్రవారం విచారణ చేపట్టనుంది.

వ్యసనాలకు బానిసై యువకుడి ఆత్మహత్య!

గోపాలపట్నం: వ్యసనాలకు బానిసైన 19 ఏళ్ల కట్టోజి అజయ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన 89వ వార్డు చంద్రానగర్‌లో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. అజయ్, అతని తల్లి కామాక్షి చంద్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. అజయ్ తల్లి బుధవారం తన స్వగ్రామమైన పార్వతీపురం వెళ్లింది. తనతో రావాలని ఆమె కోరినా అజయ్ నిరాకరించాడు. రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గోపాలపట్నం పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. అజయ్ 10వ తరగతి ఉత్తీర్ణుడై, పని లేకుండా తిరుగుతున్నాడు. అతనికి అక్క ఉంది. తండ్రి గతంలో మరణించాడు. వ్యసనాలకు బానిసైన అజయ్ డబ్బుల కోసం తల్లిపై దాడికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై పోలీసులు హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశారు. తర్వాత తల్లి ఇచ్చిన జామీను ద్వారా బయటకు వచ్చాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారత క్రికెటర్ నితీశ్‌కుమార్‌కు సత్కారం


నితీశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: భారత క్రికెటర్ కాకి నితీష్ కుమార్ రెడ్డిని బీహెచ్‌పీవీ ఓల్డ్ అండ్ న్యూ హార్ట్‌ఫుల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. తుంగ్లంలోని ఆయన బంధువుల ఇంటికి గురువారం విచ్చేసిన నితీష్‌ను అసోసియేషన్ సభ్యులు కలిసి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఆయన కుటుంబానికి, బీహెచ్‌పీవీకి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌జానే, ములకా నానిబాబు, హరిబాబు, అబ్దుల్ రజాక్ (కె.కె.అకాడమీ) పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో గల్లంతైన కాకర్ల మణికంఠ(22) మృతదేహం గురువారం నక్కపల్లి మండలం చినతీనార్ల తీరం సమీపంలో లభ్యమైంది. ఎస్ఐ విభీషణరావు వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా ప్రతిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మణికంఠ తుని మండలం లోవ కొత్తూరులో తన మేనమామ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రేవుపోలవరం తీరానికి వచ్చి గల్లంతైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తీరంలో మునిగిన సాత్విక్‌ను మణికంఠ కాపాడబోయి కెరటానికి కొట్టుకుపోయాడు. ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

21న జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి నిమిత్తం ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత సాధించి, 18-35 ఏళ్ల వయసుగల అభ్యర్థులు హాజరు కావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!





తెల్ల పులి


నీటి ఏనుగు


చింపాంజీ


కనుజులు


ఏనుగులు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణులను జూ అధికారులు దత్తత ఇస్తున్నారు. ఇందుకు దాతలు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దాతల పేరుతో జూ సిబ్బంది వాటికి ఆహారం అందిస్తారు. జూలో ఏ జంతువు, ఏ పక్షిని దత్తత తీసుకుంటే వాటి ఎన్‌క్లోజరు వద్ద వాటి ఫొటోతో పాటు దాతల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం పలువురు దాతల పేర్లతో కూడిన బోర్డులను వారు దత్తత తీసుకున్న వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద ఏర్పాటు చేశారు.

ఆకర్షణీయంగా దాతల పేర్లతో బోర్డులు


జూ పార్కులో వివిధ జాతులకు చెందిన జంతువులు, రకరకాల పక్షులు, తాబేళ్లు, మొసళ్లు, పాములు సందర్శకులను అలరిస్తుంటాయి. వాటిపై దాతలు ప్రేమ, వాత్సల్యం చూపుతూ జూ అధికారులకు సహకరిస్తున్నారు. వాటిని దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, సంవత్సరానికి ఆహారం అందించడానికి కొంత మొత్తం చెల్లిస్తున్నారు. ఇక్కడ తెల్ల పులి, ఖడ్గమృగం, జిరాఫీ తదితర పెద్ద జంతువులను పలు కంపెనీలు ఏడాది పాటు దత్తత తీసుకున్నాయి.

- ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ జిరాఫీని ఒక ఏడాది పాటు దత్తత తీసుకుంది.
- ఐవోసీఎల్ కంపెనీ ఖడ్గమృగాన్ని ఏడాది కాలం దత్తత తీసుకుంది. మరో ఏడాది దత్తత కొనసాగించడానికి ఇటీవలే ఆ కంపెనీ ముందుకు వచ్చింది.
- ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ తెల్ల పులిని ఏడాది పాటు దత్తత తీసుకుంది.
- చిన్న జంతువులు, పక్షులను కొందరు నెల, ఆరు నెలలు పాటు దత్తత తీసుకొని ఆహారం అందిస్తున్నారు. ఆయా ఎన్‌క్లోజర్ల వద్ద దాతల బోర్డులు కూడా ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఆదాయం పన్ను మినహాయింపు..

ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి వ్యక్తులు, సంఘాలు, పరిశ్రమలు వారి శక్తి మేరకు సహకారం అందించవచ్చు. ఏనుగు నుంచి చిన్న పక్షి వరకు ఎవరైనా ఎంత కాలానికైనా దత్తత తీసుకోవచ్చు. వాటి కోసం ఒక రోజు, నెల, ఏడాది వారిగా అయ్యే ఖర్చు చెల్లించవచ్చు. జూలో వన్యప్రాణులను దత్తత తీసుకున్నవారికి ఆదాయం పన్నులో మినహాయింపు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ దత్తత పద్ధతి 2011లో ప్రారంభించారు. అప్పటి నుంచి పలువురు దాతలు ముందుకొచ్చి ఇక్కడ పులులు, సింహాలు, ఏనుగులు, పక్షులకు ఆహారం అందిస్తున్నారు.


ఆస్ట్రిచ్


జీబ్రా

దాతలు ముందుకు రావాలి

జూలో వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలి. వాటికి ఆహారం అందించడంలో భాగస్వాములు కావాలి. ఇప్పటికే కొందరు దాతలు సంస్థల పరంగా, వ్యక్తిగతంగా ముందుకు వచ్చి కొన్ని జంతువులను, పక్షులను వారం, నెల, ఏడాది కాలానికి ఆహారం అందించడానికి వన్యప్రాణులను దత్తత తీసుకొన్నారు. ఎక్కువ మంది దాతలు స్పందించి ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తే మూగజీవాలకు సహకరించినవారవుతారు. దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

- జి.మంగమ్మ, జూ క్యూరేటర్

ఆహారం ఇలా...

సింహం, పులికి పశు మాంసం, చికెన్ ఆహారంగా వేస్తున్నారు. ఏనుగుకు రాగి సంగటి, చెరకు, గ్రాసం, అరటి దవ్వ, బెల్లం, కొబ్బరి కాయలు అందిస్తున్నారు. చింపాంజీలకు పళ్లు, కాయలు, పాలు ఆహారంగా వేస్తారు. జింకలు, కనుజులు, కొండ గొర్రెలు తదితర వాటికి గ్రాసం వేస్తారు. అన్ని పక్షులకు పలు రకాల పళ్ల ముక్కలు కోసి వేస్తారు. కోతులకు పళ్లు, వేరుశనగ పిక్కలు అందిస్తారు. నీటి ఏనుగుకు పళ్లు, కూరగాయలు, ఆకు కూరలు వేస్తారు. ఇలా ఇక్కడ వన్యప్రాణులన్నింటికీ వాటి ఆహారం కోసం రోజుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ఎంత మొత్తం చెల్లించాలంటే..

జంతువు / పక్షి దత్తతకు చెల్లించాల్సిన మొత్తం

జంతువు/ పక్షి	రోజుకు	ఏడాదికి
ఏనుగు	రూ.1200	రూ.4,30,000
ఖడ్గమృగం	రూ.820	రూ.3,00,000
నీటి ఏనుగు	రూ.600	రూ. 2,00,000
సింహం	రూ.600	రూ.1,90,000
పెద్ద పులి	రూ.600	రూ.1,90,000
జిరాఫీ	రూ.500	రూ.1,80,000
చిరుత పులి	రూ.400	రూ.1,25,000
ఎలుగుబంటి	రూ.300	రూ.1,10,000
చింపాంజీ	రూ.210	రూ.75,000
అడవి దున్న	రూ.200	రూ.73,000
జీబ్రా రెండింటికి	రూ.330	రూ.60,000 (ఒక జీబ్రాకు)
తోడేళ్లు రెండింటికి	రూ.300	రూ.55,000 (ఒక తోడేలుకు)
రేచుకుక్క	రూ.135	రూ.50,000
చుక్కల దుప్పి	రూ.100	రూ.36,500
రింగ్‌టెయిల్డ్ లెమూర్‌కు	రూ.100	రూ.36,500

ఇవి కాకుండా...

మొసలి/ఘరియల్ రెండింటికి రోజుకు	రూ.150	రూ.24,000 (ఏడాదికి ఒకదానికి)
హంసలు (రెండింటికి 2 రోజులకు)	రూ.100	రూ.18,000 (ఒక హంస)
నక్షత్ర తాబేళ్లు (పదింటికి ఐదు రోజులకు)	రూ.150	రూ.11,000
సారస్ కొంగ/నిప్పుకోడి/ పాములు (నాలుగు రోజులకు)	రూ.100	రూ.10,000 (ఒకదానికి)
గుడ్లగూబలు (నాలుగింటికి ఒకరోజుకు)	రూ.100	రూ.9,500 (ఒక దానికి)
మకావ్‌లు (నాలుగింటికి మూడు రోజులకు)	రూ.100	రూ.3,000 (ఒక దానికి)
పీజియన్/నెమళ్లు (నాలుగింటికి నాలుగు రోజులకు)	రూ.100	రూ.2,200 (ఒక దానికి)
ఆఫ్రికన్ చిలుకలు/రామచిలుకలు (ఐదు రోజులకు)	రూ.100	రూ.1500 (ఒకదానికి)
లవ్ బర్డ్స్ (పదింటికి ఐదు రోజులకు)	రూ.100	రూ.1,000 (ఒకదానికి)

డాక్టర్ సురేష్‌కుమార్‌కు ఘన సన్మానం


సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో డాక్టరేట్ పొందిన తెడబారికి సురేష్‌కుమార్‌ను జి.మాడుగులలో గురువారం ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, సన్యాసినాయుడు దంపతులు, మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు శాలువ కప్పి సురేష్‌కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి టెక్నాలజీని అందిపుచ్చుకొని, అనేక రంగాల్లో పరిశోధనలు చేసి ఆయా ఫలాలు ప్రజలకు చేరువ చేయాలని అన్నారు. శాస్త్రవేత్తలుగా, జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి సర్వీసులలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేయడం కోసం ఆయన డాక్టర్ వైఎస్సార్, డాక్టర్ టీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారని వారు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జల్లి సుధాకర్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం వివాదంపై విచారణ


లంబసింగిలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి: లంబసింగిలో ఇంటి స్థలం విషయంలో తలెత్తిన వివాదంపై లోకాయుక్తకు వచ్చిన ఫిర్యాదు మేరకు పాడేరు డివిజినల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఇరుపక్షాలకు చెందిన వారితోపాటు గ్రామ పెద్దలను విచారించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. హౌస్‌హోల్డ్ సర్వే, జియో ట్యాగింగ్, ఎస్‌పీసీఐ, స్వర్ణ పంచాయతీల డేటా నమోదు వంటి విషయాలపై సిబ్బందికి సూచనలు చేశారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వేసవికి ముందే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లు, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రచయిత ఎంవీవీ పార్థివ దేహం ఏఎంసీకి అప్పగింత


ఏఎంసీ అనాటమీ విభాగానికి సత్యనారాయణ పార్థివదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: ప్రముఖ రచయిత, హేతువాది, సామాజిక కార్యకర్త, శరీర, అవయవదాన ఉద్యమకారుడు ఎంవీవీ సత్యనారాయణ(76) పార్థివ దేహాన్ని గురువారం ఆంధ్రా మెడికల్ కళాశాలకు అప్పగించారు. బుధవారం 'రవళి'పత్రికకు 'ప్రమాదం అంచున'సీరియల్ భాగాన్ని పూర్తి చేసి.. మిత్రులతో ఫోన్ సంభాషిస్తూ గుండెపోటుతో ఆయన కన్నుమూశారు. సత్యనారాయణ మృతి విశాఖ సాహితీ లోకంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సత్యనారాయణ చివరి కోరిక మేరకు అతని భార్య సత్యవతి, కుమార్తెలు శిరీష, సౌజన్య, కుటుంబ సభ్యుల సహకారంతో, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్,చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి పర్యవేక్షణలో ఏఎంసీ కాలేజీ అనాటమీ విభాగానికి అతని పార్థివదేహాన్ని దానంగా అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా శరీర అవయవ దాతల సంఘం సభ్యులు టి.శ్రీరామమూర్తి, రామ ప్రభు, పీలా హరిప్రసాద్, మంతెన వెంకట రాజు, విజ్ఞానంద తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- నాణ్యమైన దిగుబడికి మీనామృతం దివ్య ఔషధం
- ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ కో-ఆర్డినేటర్ అప్పలరాజు


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగు


రాజవొమ్మంగిలో పూత దశలో ఉన్న జీడిమామిడి పంట


రాజవొమ్మంగిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న నువ్వు పంట

రాజవొమ్మంగి: పూత పిందె దశలో జీడిమామిడిపై మీనామృతం రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని ఆర్‌వైఎస్ఎస్ (రైతు సాధికార సంస్థ) ఉర్లాకులపాడు క్లస్టర్ కో-ఆర్డినేటర్ అప్పలరాజు చెప్పారు. డివిజన్ పరిధిలో సాగవుతున్న జీడిమామిడి, నువ్వు, పెసర, మినుము పంటలను ఆయను గురువారం పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఉర్లాకులపాడు క్లస్టర్‌లో దాదాపు 440 ఎకరాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఆయన మాట్లాడుతూ మీనామృతం పిచికారీ చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నట్టు తెలిపారు. చేపలు, బెల్లంతో తయారు చేసిన మీనామృతం జీడిమామిడి సాగులో ఎంతో ఉపయోగకారిగా పనిచేస్తుందన్నారు. ఈ పద్ధతిని పాటిస్తే ఒక్కో మొక్కకు 20 కిలోల (ఎకరాకు సుమారు 14 క్వింటాళ్లు) దిగుబడి సాధించవచ్చన్నారు. మండలంలోని కొమరాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌పీఎం షాపు (ప్రకృతి వనరుల కేంద్రం) ప్రకృతి వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల ద్రావణాలు తక్కువ ధరకే పొందవచ్చన్నారు. ప్రసుతం రబీలో సాగవుతున్న నువ్వులు, మినుము, పెసర పంటలపై నీమాస్త్రం పిచికారీ చేస్తే పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. మండలవ్యాప్తంగా మరో ఐదు క్లసర్టర్లలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నట్టు అప్పలరాజు తెలిపారు. మరిన్ని వివరాలకు రైతులు దగ్గరలోని రైతు సాధికార సంస్థ కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని కోరారు.

సూచనలతో సత్ఫలితాలు



ప్రకృతి సేద్యంలో భాగంగా 2014లో ప్రారంభమైన రైతు సాధికారి సంస్థ మన్య ప్రాంతంలో ప్రతి మండలంలో మంచి ఫలితాలు ఇస్తోంది. వాతావరణ మార్పులను తట్టుకొని, తక్కువ ఖర్చుతో సహజ వ్యవసాయం కోసం జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్ లో రైతులను ప్రోత్సహిస్తున్నాం.

- అప్పలరాజు, క్లస్టర్ కో-ఆర్డినేటర్, ప్రకృతి వ్యవసాయం

రాత పరీక్షకు 221 మంది అర్హత


పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఏయూ క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి నియామక బోర్డ్ పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి రాత పరీక్షకు 221 మంది ఎంపికయ్యారు. గురువారం 280 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన వారు కైలాసగిరి వద్ద ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి పి.ఎం.టి, పి.ఈ.టి పరీక్షలకు 280 మంది హాజరయ్యారు. ముందుగా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి బయోమెట్రిక్ తీసుకున్నారు. అనంతరం దేహదారుఢ్య పరీక్షలు జరిపారు. వీరిలో 221 మంది తదుపరి మెయిన్ రాత పరీక్షకు అర్హత సాధించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరావు, ఆర్ఐలు ఎల్.మన్మథరావు, బి.రామకృష్ణారావు, ఐటీ కోర్ ఎస్ఐ బి.సురేష్ బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆరాధాన ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఈ ఏడాది ఏడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తొలి రోజు 17న తమిళనాడు సంగీత, లలిత కళల విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, ప్రముఖ వీణ విద్వాన్సురాలు వీణా ఈ.గాయత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక సంగీత కళాభారతి అవార్డును ప్రముఖ నాదస్వర విద్యాంసుడు గురువిల్ల అప్పన్నకు అందిస్తున్నామని తెలిపారు. అవార్డుతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రశంసాపత్రం, రూ.10వేలు నగదు పురస్కారం అందిస్తామన్నారు. అనంతరం సంగీత కార్యక్రమంలో హంస అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు త్యాగరాజ కీర్తనలతో కూర్చిన 'సంగీత సాహిత్య సద్భక్తి సమన్వయం' కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రెండో రోజు 18న ఉదయం 7 గంటలకు స్థానిక త్యాగరాజ ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన తర్వాత శ్రీ సీతారామ పరివారాన్ని ఊరేగింపుగా కళాభారతి చూట్టూ, వందలాది కళాకారులు గానం చేస్తుండగా కోలాటం, నాదస్వర వాయిద్యాలతో, కార్యదర్శి డాక్టర్.గుమ్ములూరి రాంబాబు త్యాగరాజ వేషధారణలో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

అనంతరం 200 మంది పైగా సంగీత విద్వాంసులు ఘనరాగ పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం మంగళ ధ్వని - నాదస్వర వాద్యం గురువిల్లి అప్పన్న బృందం కచేరీ ప్రారంభమవుతుందని తెలిపారు. వారం రోజులపాటు జరిగే కచేరిలో పాల్గొనేందుకు 1169 దరఖాస్తులు రాగా వాటిలో 1110 అంగీకరించామన్నారు. ఏడు రోజుల పాటు 404 సంగీత కచేరీలు నిర్వహించనున్నామన్నారు. చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి కళాకారులు తరలివస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బైక్ వీల్ పంచర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పీఎంపాలెం: ద్విచక్రవాహనం ముందు చక్రం పంచర్ కావడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. రెల్లివీధికి చెందిన పి.శ్రీనివాస్, పరిసర ప్రాంతాలకు చెందిన చెందిన అతని మిత్రులు జి.శివ, బసవ షణ్ముఖ సాయికుమార్ బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 గంటల ప్రాంతంలో భీమిలి వైపు వెళ్తున్నారు. శివ బైక్ నడుపుతుండగా.. రుషికొండ బీచ్ రోడ్డులో గ్రాండ్ హోటల్ సమీపంలో ముందు చక్రం పంచర్ అయింది. ప్రమాదంలో ముగ్గురూ కింద పడిపోగా.. శ్రీనివాస్, షణ్ముఖ సాయిలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.